# పోశాలు

- అత్తలూరి విజయలక్ష్మి

తూర్పున ఉదయరేకలు విచ్చుకుంటున్నాయి. చల్లగాలి కిటికీ గుండా గదిలోపలికి చొచ్చుకుని వస్తోంది. నాకు నిద్ర లేవాలనిపించలేదు. కానీ రోజూలాగే ఈరోజూ తెల్లవారకుండానే మెలకువ వచ్చింది. కళ్లు మాత్రం తెరిపిడి పడడం లేదు. బలవంతంగా కళ్ళు తెరిచి కిటికీలోంచి బైటికి చూశాను. ఎంతో ఆహ్లాదంగా ఉంది ప్రకృతి. నేను ఎంతో ముచ్చటపడి మా ఆకాశవాణి గార్డెన్ నుంచి తెచ్చుకుని నాటిన బ్లీడింగ్ హార్ట్ క్రోటన్ మొక్క ఏపుగా, అందంగా పెరిగి నా చిన్న లాన్‌కి ఆకర్షణని కలిగిస్తోంది. ఆ మొక్క మా ప్యూన్ పోశాలు నాటాడు. పోశాలు గుర్తుకు రాగానే టైం గుర్తొచ్చింది. నా మంచానికి సమీపంగా ఉన్న టేబిల్ మీద ఉన్న అలారం టైం పీసు మీదకి నా దృష్టి పోయింది. 'అమ్మో' ఐదుంబావు. మొదటి ప్రసారం ఆరింటికల్లా మొదలుపెట్టాలి. చివ్వున లేచాను. చకచకా బ్రష్ చేసుకుని, డ్రస్ మార్చుకుని పరిగెత్తాను. స్టూడియోకి చాలా దగ్గర నా క్వార్టరు. నేను వెళ్ళేసరికే పోశాలు వచ్చి మొక్కలకి నీళ్ళు పోస్తున్నాడు. సూర్యుడు గతి తప్పచ్చుగానీ, పోశాలు మాత్రం టైమింగ్స్ తప్పడు... టైం ప్రకారం తన పని చేసుకుంటాడు... రాత్రి పన్నెండింటి దాకా స్టూడియోలోనే తిరుగుతూ మా అందరికీ ఏం కావాలో కనిపెట్టి సమయానికి అన్ని అమరుస్తూ, అలసట అనేది ఎరగనివాడిలా తిరుగుతుంటాడు.

ఎప్పుడు నిద్రపోతాడో, అసలు నిద్రపోతాడో, పోడో అర్థంకాని పోశాలు ఐదింటికల్లా డ్యూటీకి రావడం, అదీ ఫ్రెష్‌గా రావడం నాకెప్పుడూ ఆశ్చర్యంగానే అనిపిస్తుంది. నన్ను చూడగానే ఎప్పటిలాగే నవ్వుతూ విష్ చేశాడు.

తల ఊపి లోపలికి పరిగెత్తుతుంటే అన్నాడు... "అమ్మా! చాయ్ తెచ్చిన తాగి పొండ్రి... మల్ల లోపలకి పోతే ఎప్పుడొస్తరో!" అంటూ చేతిలో ఉన్న రబ్బరు ట్యూబు పచ్చగడ్డిమీద పడేసి, నాతో పాటు డ్యూటీ రూంకి వచ్చాడు.

నాకు కావలసిన టేపులు, అనౌన్స్‌మెంటు తాలూకు కాగితాలు తీసుకుంటుంటే, కప్పులో టీ పోసి, నాకూ, డ్యూటీ ఆఫీసర్ ప్రసాద్‌కి ఇచ్చాడు...

ఏం పోశాలూ నీ పెళ్లిట కదా ఎప్పుడు? అనడిగాడు ప్రసాద్...

నేను ఆశ్చర్యపోయాను పోశాలుకి పెళ్లా... ఇప్పటికే రెండుసార్లు పెళ్లిళ్లు చేసుకుని, భార్యల్ని కోల్పోయిన పోశాలు తనకింక పెళ్లియోగం లేదని, నిశ్చయించుకుని, తన జీవితాన్ని మా అందరి సేవలకు వినియోగిస్తున్నాడని మేమంతా నిర్ణయించుకున్నాం. అలాంటిది. ఇప్పుడు మళ్లీ పెళ్లి అంటోంటే పోశాలు వైపు కుతూహలంగా చూశాను ఏం చెబఉతాడో అన్నట్టుగా...

"మన ఎస్‌డి సాబ్ చేసుకోమని పరేషాన్ చేస్తుండు సార్! అన్నం వండనీకి, బీమారైతే సూడనీకి ఎవరున్నరు... పెండ్లాం ఉంటే చూస్తది... పెండ్లి చేసుకో అని ఊకే చెబ్తుండు..." అన్నాడు.

"ఇంతకీ పిల్లెవరు?" అడిగాడు ప్రసాద్.

"స్వీపరు లక్ష్మి..." అంటూ కప్పులు తీసుకుని కడగడానికి వెళ్లిపోయాడు పోశాలు...

అయితే మా స్వీపరు లక్ష్మిని చేసుకుంటున్నాడా పోశాలు? లక్ష్మి భర్త గత ఏడాది కల్తీ కల్లు తాగిపోయాడు. అప్పటికి ఆమె గర్భవతి. అంతకుముందు ఏడాది కొడుకుంటే వాళ్లక్కకి పిల్లలు లేరని పెంపకానికిచ్చింది. తరువాత ఆడిపిల్ల పుట్టింది. పిల్లల తల్లిని పెళ్లి చేసుకోడానికి పోశాలు ఒప్పుకున్నాడా? ఎస్‌డి గారు ఒప్పించారా? అప్పుడప్పుడూ ఇలాంటి పనులు చేసి, సంఘ సంస్కర్తననిపించుకోడం ఎస్‌డి గారికి అలవాటే.

ఆలోచిస్తూ ప్రసార సమయం అవడంతో సిగ్నేచర్ ట్యూన్, నాదస్వరం వున్న టేపు, భక్తి సంగీతం టేపులు తీసుకుని స్టూడియోకి వెళ్ళాను.

అప్పటికి ఐదు గంటలా ఏభై ఎనిమిది నిమిషాలు. సిగ్నేచర్ ట్యూన్ ఆన్ చేసి, శుభోదయం పలికే సరికి ప్రసార సమయం అయింది. భక్తి సంగీతం మొదలవగానే నాక్కొంచెం ఊపిరి పీల్చుకున్నట్టుగా అయింది. తిరిగి పోశాలు గురించి, లక్ష్మి గురించి ఆలోచనలు మొదలైనాయి. పోశాలుకి రెండో పెళ్లి అమ్మాయిని చేసుకునేంత విశాల హృదయం ఉందా? పెళ్లి అయ్యాక ఆమె పిల్లల్ని తన పిల్లలుగా చూసుకుంటాడా? లేక... లేక మధులాగా... ఎస్‌డి గారికి గొప్ప పనులు చేసి కీర్తి గడించాలన్న ఆకాంక్ష ఉంటే ఉండచ్చు గాక, కానీ, ఇలా ప్రశాంతంగా ఉన్న జీవితాల్లో అలజడి రేపే అధికారం ఎవరిచ్చారు?

భక్తి సంగీతం అయిపోయింది... ఆవేళటి కార్యక్రమాల వివరాలు చెప్పి, సూక్తులు చెప్పేటప్పటికి వార్తల సమయం అయింది. వార్తలు మొదలైనాయి.

మళ్లీ లక్ష్మి, పోశాలు గురించిన ఆలోచనలు నన్ను ముప్పిరిగొన్నాయి. పోశాలు పెళ్లి వార్త, అందులోనూ, ఒకసారి పెళ్లి అయి, ఇద్దరు పిల్లల తల్లి అయిన లక్ష్మితో అన్న సంగతి తెలిశాక నాలో ఒక అలజడి మొదలైంది. నేను కూడా లక్ష్మి లాగే ఒక భ్రమతో మధుని నా జీవితంలోకి ఆహ్వానించాను. కానీ, ఏమైంది? విద్యావంతుడైన మధులో లేని సంస్కారం, విశాల హృదయం అతి సాధారణ వ్యక్తి పోశాలులో ఉంటాయా?

వార్తలు అయిపోయాయి. పసిపిల్లల పెంపకం గురించి పీడియాట్రిషన్ డాక్టర్ నిరుపమాదేవితో పరిచయ కార్యక్రమం మొదలైంది. అదొక పదిహేను నిమిషాలు సాగిపోతుంది. ఈలోగా వేయాల్సిన పాటలకి సంబంధించిన రికార్డ్స్ రెడీగా పెట్టుకోడం ప్రారంభించాను. నా మనసంతా లక్ష్మి, పోశాలు నిండిపోయి ఉన్నారు. వాళ్ల పెళ్లి వార్త విన్న దగ్గర్నించీ, మనసంతా ఎలాగో అయిపోతోంది... అర్థం కాని కలవరం, లక్ష్మి మోసపోతోందేమో! పోశాలు లక్ష్మి పిల్లల్ని తన పిల్లల్లా ఆదరిస్తానని చెప్పాడా? ఎస్‌డి గారు ఎందుకు వీళ్లకి పెళ్లి చేస్తున్నారు?

పాచి పని చేసుకుంటూ తన పిల్లల్ని తను సాకుతోన్న లక్ష్మికి లేనిపోని ఆశలు చూపించి కష్టాల ఊబిలో పడేస్తున్నారా? నో లక్ష్మికి చెప్పాలి... "ఏ మగవాడు కూడా పరాయి పిల్లల్ని తన పిల్లల్లా చూడలేడు... పోశాలు నిన్ను మోసం చేస్తాడు... నీ పిల్లలు నా పిల్లల్లాగే అనాధలు అవుతారు... ఈ పెళ్లికి ఒప్పుకోవద్దు లక్ష్మీ!" అని చెప్పాలి ఆవేశంగా కుర్చీలోంచి లేచాను.

పసి పిల్లల్ని పెంచడం ఒక కళ. అది చాలా మందికి చేతకాదు. పిల్లల సైకాలజీ తెలుసుకుని వాళ్ళకి ఏ సమయంలో ఏం కావాలో తెలుసుకుని ఆ సమయానికి అది అమరిస్తే వాళ్లతో పేచీనే ఉండదు. డాక్టర్ నిరుపమాదేవి స్వరం వినిపించి, ఆగిపోయి కుతూహలంగా వినసాగాను. పిల్లలకి ప్రథమ గురువు తల్లి... తల్లి ప్రేమ లభించని పిల్లలు చాలా దురదృష్టవంతులు. సాధారణంగా ప్రతి ఇంట్లో తండ్రి పిల్లల పెంపకం విషయంలో అంతగా శ్రద్ధ చూపడు. మనం అనేకమంది మహనీయుల కథలు విన్నాం. దాదాపు అందరి విజయం వెనకా తల్లి శ్రద్ధాసక్తులే కనిపిస్తాయి. అయితే ఇటీవల కొందరు స్త్రీలు, వైవాహిక జీవితం విఫలం అయి, తప్పనిసరి పరిస్థితుల్లో పునర్వివాహం చేసుకుంటూ, తమ వైవాహిక జీవితానికి ఆటంకం ఉండకూడదని పిల్లలని రెసిడెన్షియల్ స్కూల్స్‌లో చేర్పిస్తున్నారు. దానివలన కొందరు పిల్లలు అటు తల్లి ప్రేమకు, ఇటు తండ్రి ప్రేమకు నోచుకోకుండా ప్రేమరాహిత్యంతో బాధపడుతూ చిన్నప్పట్నించీ కూడా ఒక విధమైన మనో వేదనకి లోనవుతున్నారు.

నాకింక దేనిమీదా దృష్టి నిలవలేదు... నా చిన్నారి లౌక్య గుర్తొచ్చింది... నేను చేసిన ఒక పొరపాటు వలన నేనూ, లౌక్యా కూడా జీవిత కాలానికి సరిపడా శిక్ష అనుభవిస్తున్నాం. ఒక్కసారి నా మనసంతా నా గత జీవితాన్ని సింహావలోకనం చేసుకోడంలో మునిగిపోయింది. డిగ్రీ పూర్తి కాగానే అరుణ్‌తో నా వివాహం అయింది. అరుణ్ డిఫెన్స్‌లో ఉండడం చేత, అతను చాలా తక్కువ సమయం నాతో గడిపేవాడు. మిగతా సమయం ఎందుకు వృధా చేయడం అని ఉద్యోగం కోసం ప్రయత్నిస్తుంటే అనుకోకుండా ఆల్ ఇండియా




రేడియోలో అనౌన్సర్‌గా ఉద్యోగం వచ్చింది. మా దాంపత్యానికి చిహ్నంగా పెళ్లయిన మూడేళ్లకు లౌక్య పుట్టింది. మా అన్యోన్యత చూసి బహుశా విధికే కన్ను కుట్టిందేమో కార్గిల్ యుద్ధంలో అరుణ్‌కి నూరేళ్లూ నిండాయి. తరువాత కొంతకాలం ఒంటరిగా జీవనపయనం సాగించినా, నాన్నగారు మాత్రం నేను చిన్న వయసులో అన్ని సుఖాలను కోల్పోడం తట్టుకోలేక, భార్యతో విడాకులు తీసుకున్న మధుతో నాకు పునర్వివాహం జరిపించారు.

మధుకి నేనంటే ఇష్టమే అయినా, పాపని మాత్రం నిండు మనసుతో స్వీకరించలేకపోయాడు. ఫలితంగా లౌక్యని రెసిడెన్షియల్ స్కూల్‌లో చేర్పించాల్సి వచ్చింది. నేను ఎంతో ప్రతిఘటించాను. మధునైనా వదులుకుంటాను కానీ, పాపని వదలనని. కానీ, నాన్నగారు నాకు నచ్చచెప్పి ఒప్పించారు. ఆ తరువాత మధుకి బదిలీ అయింది. లాగా ఒంటరిగా ఉండాలి. పాపను తిరిగి తెచ్చుకుంటాను అని ఎంత బతిమాలినా అటు నాన్నగారు కానీ, మధు కానీ అంగీకరించలేదు. చేసేది లేక మనసు రాయి చేసుకున్నాను. నెలకోసారి మాత్రం వెళ్లి లౌక్యని చూసి వస్తుంటాను. మధు వారానికోసారి వస్తుంటాడు. అప్పుడు కూడా లౌక్యని చూడాలన్న ఆసక్తి కనపరచడు. మధుకి నేనంటే ఇష్టమో, కోరికో అర్థం కాదు నాకు. ఎంతో ఆదర్శవాదిలా

వితంతు వివాహం చేసుకున్నానని అంటుంటాడు నాతో. మరి అతని ఆదర్శం పాప విషయంలో ఏ గంగలో కలిసిందో ఎంత ఆలోచించినా నాకర్థం కాలేదు ఈరోజు వరకూ. పిల్లలు లేని మధు నా పాపని ఆదరిస్తాడని ఆశించిన నా నెత్తిన మొదటిరాత్రే పిడుగు పడింది.

లౌక్యని విడిగా పడుకోబెట్టి, నేను మధు పక్కలోకి వెడుతోంటే నా మనసంతా కలచి వేసినట్టు అయింది. చాలాసేపటి దాకా దాన్ని వదిలిపెట్టి గదిలోకి వెళ్లలేకపోయాను. నాకోసం ఎదురు చూసి, చూసి బైటకి వచ్చిన మధు నేను లౌక్య పక్కన పడుకోడం చూసి, "ఈ మాత్రానికి నన్నెందుకు చేసుకున్నావు?" అంటూ కోపాన్ని బలవంతంగా అణచుకోడం నాకు ఆశనిపాతం అయింది.

"పాపని నిద్రపుచ్చి వస్తానండి" అంటే నేను ఊహించని మాట అన్నాడు.

"నీ గతంతో సంబంధం లేకుండా నిన్ను కావాలనుకున్నాను. చేసుకున్నాను. అలాగని నీ కూతుర్ని నా కూతురు అని ఈ సమాజానికి ప్రచారం చేయాలన్న అభిలాష గాని, అంత గొప్ప మనసు కానీ లేదు. ఆర్థికంగా కానీ, ఇతరత్రా కానీ నాకేం బాధ్యత లేదు. నీ పిల్లని నువ్వే చూసుకోవాలి. నువ్వు ఉద్యోగస్తురాలివి కాబట్టి ఆ పిల్ల చదువూ, తిండీ అంతా నీదే బాధ్యత."

అప్పుడు నాకూ అనిపించింది ఈమాత్రానికి నేను ఇతన్నెందుకు చేసుకున్నాను అని. తను నన్ను ఆదర్శ వివాహం చేసుకున్నాడా? మరి నేను? ఈ ప్రశ్నకి సమాధానం నాకు లభించలేదు.

కోపం అణచుకుంటూ శాంతంగా అడిగాను. "ఈ విషయం ముందు ఎందుకు చెప్పలేదు."

"మీ నాన్న గారికి చెప్పాను. ఆయన పెళ్లి ప్రస్తావన తెచ్చినరోజే చెప్పాను. నీకు చెప్పలేదా ఆయన" అన్నాడు.

''లేదు. నాన్నగారు చెప్పలేదు'' అయోమయంగా అన్నాను.

"అయితే తప్పు ఆయనది. ఆయన్నే అడుగు" అన్నాడు.

నాన్నగారు నాకు మధు సంగతి చెబుతూ అన్నది ఒకటే మాట. ''నువ్వు అదృష్టవంతురాలివమ్మా. మధు నిన్ను ఇష్టపడుతున్నాడు. నా మాట విని ఈ పెళ్లికి ఒప్పుకో. ఈ సమాజంలో ఒంటరిగా బతకడం కత్తిమీద సాము. అన్నదమ్ములు కూడా లేనిదానివి మా తదనంతరం నిన్నెవరు చూస్తారు?" అంటూ బతిమాలి ఒప్పించారు.

ఆరోజు "నన్ను భార్యగానే కాదు, పాపని కూతురుగా కూడా అంగీకరిస్తాడా నాన్నా" అని నేనడగలేదు ఆయన చెప్పలేదు.

ఆ రాత్రి మధు అల్లా అన్నాక నాన్నగారిని నిలదీశాను. "ఏంటి నాన్నా ఇది పాపని హాస్టల్లో చేర్పించాలని నాకు చెప్పలేదేం" అని.

"పిల్ల తల్లివైనా నిన్ను పెళ్లి చేసుకోడానికి ఒప్పుకోవడమే గొప్ప విషయం. పిల్లని కూడా యాక్సెప్ట్ చేయమనడం న్యాయం కాదమ్మా. దాన్ని హాస్టల్లో చేర్పించడమే ఉచితం. మనక్కావలసింది పిల్ల బాగా చదువుకుని వృద్ధిలోకి రావడం అంతే. నీకు శక్తి ఉన్నంతవరకూ చదివించు. ఆ తరువాత పెళ్లి చేసి పంపించేస్తే బాధ్యత తీరుతుంది. దానికోసం నీ జీవితం ఎందుకు నాశనం చేసుకుంటావు? మధుకి అసలు ఆడపిల్లలంటే ఇష్టం లేదు. పైగా పరాయి వాడి కూతుర్ని ఎలా ఆదరిస్తాడనుకున్నావు?" అన్నారు.

"మరి... మరి ఎందుకు ఒప్పుకున్నావు నాన్నా?" అని అడిగాను.

"నా కళ్ల ముందు నువ్విలా అన్ని సుఖాలకూ దూరమై బతుకుతుంటే తండ్రిగా భరించలేకపోతున్నానమ్మా."

హతాశురాలినైనాను. నా మీద ఆయనకున్న ప్రేమ నాకు నా కూతురి మీద ఉండదనుకున్నారా నాన్నగారు! అనిపించింది. నా స్వార్థం కోసం చిన్నా లౌక్యని అనాధని చేశానని ఎంత ఆవేదన అనుభవించానో ఎవరూ అర్థం చేసుకోలేరు. దాన్ని హాస్టల్లో చేర్పించి వచ్చే రోజు గుండె తెగిపడేలా ఏడ్చాను. కనీసం దాని తండ్రిగా రికార్డులో తన పేరు రాయడానిక్కూడా అంగీకరించలేదు మధు. అతని ఆదర్శంలో ఆంతర్యం తరువాత తెలిసింది. నాన్నగారి ఆస్తికోసం, నా అందం కోసం మాత్రమే

మధు నన్ను వివాహం చేసుకున్నాడు. అప్పటికే అనూరాధ రెండో పెళ్లి చేసుకుందన్న వార్త అందరికీ తెలిసిపోడంతో పరువు కాపాడుకోడానికి అన్నీ భరించాను. మధు నన్ను ఎంత బాగా చూసుకున్నా ఆ ప్రేమలో స్వార్ధమే కనిపిస్తూ ఉంటుంది నాకు. అయినా, అనేకసార్లు ఈ విషయం ప్రస్తావించి, లౌక్యని ఇంటికి తీసుకురావడానికి మధుని కన్విన్స్ చేయడానికి ప్రయత్నించాను. కానీ అతను ససేమిరా అన్నాడు.

ఇవాళ ఉదయం ఆహ్లాదకరమైన వాతావరణంలో నిద్రలేచిన నాకు పోశాలు పెళ్లి వార్తతో మనసంతా కలతతో నిండిపోయింది. భారమైన మనసుతో డ్యూటీ ముగించుకుని ఇంటికి బయలుదేరాను. గేటులో ఎదురైంది లక్ష్మి. "నమస్తే అమ్మా" అంటూ.

"నీ పెళ్లిట కదా లక్ష్మీ" అడిగాను.

లక్ష్మి తలవంచుకుని నవ్వింది.

''వద్దు లక్ష్మీ చేసుకోకు. అనవసరంగా రొంపిలో దిగకు." నోటి దాకా వచ్చిన మాట ఎస్‌డి గారి కారు గేటు లోపలికి రావడంతో నోట్లోనే ఆగిపోయింది. ఆయనకు విష్ చేసి, ఆయన వెనకాలే లోపలికి నడిచాను.

"ఏమ్మా అనూ. మొదటి ప్రసారం అయిందా? వెళ్తున్నావా?" అడిగారాయన.

ఆయన మాటకి సమాధానం చెప్పకుండా ''సార్. మీరు పోశాలుకీ, లక్ష్మికీ పెళ్లి చేస్తున్నారటగా. నిజమేనా" అడిగాను.

"అవునమ్మా. పాపం ఇద్దరూ అనాథలే. ఒకళ్లకొకళ్లు తోడుగా ఉంటారుగా. అందుకే చేయాలనుకుంటున్నాను. ఏదో మన దగ్గర పని చేస్తున్నందుకు ఈ సాయం చేస్తే గుర్తుంచుకుంటారుగా."

''అది కాదు సార్ లక్ష్మికి ఇద్దరు పిల్లలున్నారు."

"పెద్ద పిల్లవాడిని పెంపకానికిచ్చిందిటగా."

"రెండో పిల్ల. ఆడపిల్ల ఉంది."

"అందుకే. ఆడపిల్లని పెంచడం మాటలు కాదుగా. పైగా ఒంటరి ఆడది. తోడుగా ఎవరో ఒక మగాడుంటాడుగా."

''కానీ.'' నేను నా అనుమానం వ్యక్తపరచబోతుండగా ఆయన టేబిల్ మీది టెలిఫోన్ మోగింది. ఆ టెలిఫోన్ టాక్ ఇప్పట్లో ముగియదు. నేను బైటకి వచ్చేశాను.

నా మనసులో భయం, అనుమానం, సందేహం అలాగే ఉండగానే పోశాలు, లక్ష్మిల వివాహం మా ఎస్‌డి గారి ఆధ్వర్యంలో, మా ఆకాశవాణి ఆడిటోరియంలో, స్టాఫ్ సమక్షంలో నిరాడంబరంగా జరిగిపోయింది. ఎస్‌డి గారు వధూవరులకు క్వార్టరు ఒకటి అలాట్ చేశారు. పోశాలు తరఫున మేమంతా ఉన్నాము. లక్ష్మి తరఫున ఆమె అక్కగారు, బావగారు, వాళ్లు పెంచుకుంటున్న లక్ష్మి కొడుకు వచ్చారు. అక్క ఒడిలో లక్ష్మి కూతురు పడుకొని ఉంది. అంటే కూతుర్ని కూడా అక్కకే ఇచ్చి పెళ్లి చేసుకుని కులుకుదామనుకుంటోందా లక్ష్మి! పీకలదాకా ఆమె మీద కోపం వచ్చింది నాకు. ఎంత స్వార్ధం అనిపించింది.

ఒక స్వీటు, బిర్యానీ, పెరుగు పచ్చడి, అన్నం, సాంబారుతో సింపుల్‌గా అందరికీ స్వంత ఖర్చుతో భోజనాలు పెట్టించారు ఎస్‌డి గారు. ఆయన విశాల భావాలకూ, సంస్కారానికీ, జోహార్లర్పించకుండా ఉండలేకపోయాను కానీ, నా మనసులో మాత్రం లక్ష్మి పట్ల కోపం నిండిపోయింది. ఎంతైనా తక్కువ కులం వాళ్లకి

## అందాల అరుణిమ

ప్రియ నేస్తం!
నిను చూడని క్షణం
నాకు కాలం
నిశ్చలమైన
ప్రవాహం లాంటిది.
నిను చూసిన క్షణం
నాలోని అనుభూతి
ఎగసిపడే కెరటం లాంటిది.
నీ వాలుచూపులు
దోబూచులాడుతుంటే
నీ అందాల అరుణిమ
చూస్తూ పులకరించిపోయా.

– గుడిమెట్ల గోపాలకృష్ణ

తక్కువ బుద్ధులే ఉంటాయి. అనవసరంగా వీళ్ల గురించి వారం రోజులుగా మథనపడ్డాను అనిపించింది. భోజనాలు అయ్యాక బయలుదేరి వస్తూ వాళ్లిద్దరివైపు చూశాను. మెడలో పూలదండలు, కొత్త బట్టలు. రెండో పెళ్లి వాళ్లయినా, యువ దంపతుల్లా నిలబడి అందరివైపు ఆనందంగా చూస్తున్నారు. నేను చివ్వున తల తిప్పుకుని గేటువైపు నడిచాను.

ఇంతలో లయ్మి అక్కగారి ఒళ్లో ఉన్న పాపాయి నిద్రలేచి కెవ్వుమంది. ఆమె పాపను ఊరుకోబెట్టడానికి ప్రయత్నిస్తోంది. కానీ పాప ఊరుకోలేదు. అంతకంతకీ పాప ఏడుపు తారస్థాయికి చేరుకుంది. నేను ఆగిపోయి లక్ష్మి వైపు చూశాను. కదలకుండా రాయిలా నిశ్చలంగా నిలబడి పాపవైపు చూస్తోంది. పోశాలు ఎవరితోటో మాట్లాడుతున్నాడు. ఆమెలోని కాఠిన్యానికి చేష్టలుడిగి నిలబడ్డాను బొమ్మలా. పాప ఏడుస్తోంది. ఎవరెంతగా ఓదార్చినా ఆగడం లేదు. లక్ష్మి నిలబడ్డ చోటు నుంచి అడుగు ముందుకు వేసి, తిరిగి వెనక్కి తీసుకుని పోశాలు వైపు బిక్క మొహంతో చూసింది.

పోశాలు దృష్టి పాపమీద పడింది. తిరిగి లక్ష్మి వైపు చూశాడు. బొమ్మలా నిలబడిన ఆమెవైపు వింతగా చూసి "ఏంది గట్ల నిలబడ్డవు? బిడ్డ ఏడుస్తుంది ఇనపడ్తలేదూ... పో... పోయి బిడ్డకి పాలియ్యి!" అనలు, సినలైన భర్తలా గదమాయించాడు. మగాడు. ఎలాంటివాడైనా మగాడు. ఎలా ఉన్నా మగాడు. ఇటు తాళి కట్టగానే అప్పటిదాకా ఏమాత్రం పరిచయం లేని ఆడదాని మీద ఎంతటి అధికారాన్ని పొందాడు. అయితే ఏం ఆ స్వరంలో ఎంత ఆర్ద్రత. ఎంత సంస్కారం. ఎంత మార్దవం. ఇతనేనా చదువూ, సంస్కారం లేని పోశాలు. ఇతనికీ, కంప్యూటరు ఇంజనీరు మధుకి పోలికెక్కడ?

పోశాలు పట్ల అంతులేని గౌరవంతో చమర్చిన నా కళ్లకు లేడిపిల్లలా పాపాయి దగ్గరకు పరిగెత్తుతోన్న లక్ష్మి మసకమసకగా కనిపించింది.

# నన్ను చూసి నక్షత్రాలు నవ్వుతాయి

గోవులకు దాణా వేసి
పాలు పితికి నటుల
అమాయకాగ్రేసరులకు
అన్నం పెట్టి ఓట్లు లాగితే
ఎంత లాఘవం
ఎంత చోద్యము-
పూలమొక్కల పగిది
బాలబాలికలను
సమానంగా పెంచాలి
తేడాలెందుకు?
పనిచేస్తే పావలా
అరట్లు కొడితే అర్ధరూపాయా
ఇదెక్కడి న్యాయం-
కొండను కూడా పిండి చేస్తున్నారు
కార్మికులు - కష్టంమీద
యజమాని ఎ.సి. కారులో షికారా
నవ్వుతున్నాయి నన్ను చూసి
నక్షత్రాలు-
సమాజమంటే నిర్వచనం
ఏమని చెప్పను?
'పని లేకనే భిక్షకులు
అతివాదులు, ఉగ్రవాదులూ
పుట్టుకొస్తున్నారు'
అని మేధావులు నిరంతరం
ఘోషిస్తుంటారు
మార్పు ఆశించడం
ఆనందదాయకం.

- ఎద్దుల శంకరనారాయణ